సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 15 । జూన్ । 2025



అంజన్నకు అభిషేక సేవ

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అభిషేక సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అర్చకులు పంచామృత అభిషేకం చేశారు.



రూ.15 కోట్ల బిల్లులు పెండింగ్

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో మెస్ నిర్వాహకులకు ప్రభుత్వం రూ.కోట్ల మేర మెస్ బిల్లులు చెల్లించకుండా **జాప్యం చేస్తోంది.** IIలో ▸



కల్తీ విత్తనాలతో జాగ్రత్త!

నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కల్తీ విత్తనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు. IIలో ▸

కౌలుకునేదెలా..?

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతుండగా కౌలు గుర్తింపు కార్డుల జారీ నత్తనడకన సాగుతోంది. 2025–26 సీజన్‌కు గాను జిల్లాలో 1.05 లక్షల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం 3,720 మందిని మాత్రమే గుర్తించారు. కార్డుల జారీని ముమ్మరం చేసే దిశగా రెవెన్యూ, వ్యవసాయ శాఖలు ఇంకా గ్రామ సభలు ప్రారంభించిన దాఖలాలు లేవు.

- నత్తనడకన కౌలు గుర్తింపు కార్డుల జారీ
- జిల్లాలో లక్ష్యం 1.05 లక్షలు.. జారీ కేవలం 3,720
- కానరాని గ్రామ సభలు
- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- లక్ష్యానికి మించి కార్డులు జారీ చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



వరిసాగు

సాక్షి, భీమవరం: జిల్లాలో వరి పండించే రైతులు 3.5 లక్షల వరకు ఉండగా 1.5 లక్షల మంది వరకు కౌలు రైతులు ఉంటారని అంచనా. సాధారణ రైతుల మాదిరి పంట రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంట నష్ట పరిహారం కౌలు రైతులకు అందేవి కాదు. అయినకాడికి అప్పులు చేసి సేద్యం చేయడం, విపత్తులు, పంట తెగుళ్లతో నష్టం వాటిల్లితే రుణ ఊబిలో కూరుకుపోయేవారు. అప్పుల బాధ తాళలేక కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. వీరి కష్టాలు గుర్తించిన దివంగత సీఎం వైఎస్సార్ జాయింట్ లెయిబిలిటీ గ్రూపులు (జేఎల్‌జీ) ఏర్పాటు చేసి కౌలు రైతు సంఘాలకు రుణ సదుపాయం కల్పించారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు జేఎల్‌జీని అటకెక్కించాయి. 2011లో ప్రభుత్వం కౌలు చట్టం తెచ్చినా కౌలుదారుని సమాచారంతో పాటు సాగు భూమి వివరాలు నిక్షిప్తం చేయాలని నిబంధన పెట్టింది. తమ భూమి వివరాలను ఇవ్వడం వలన భవిష్యత్తులో సాగుదారులతో చిక్కులు ఎదురవుతాయన్న భావనతో వివరాలు తెలిపేందుకు భూ యజమానులు ముందుకు రాక ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు.

ప్రస్తుతం నత్తనడకన జారీ

2.08 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ ఏరువాకను నిర్వహించగా కౌలు గుర్తింపుకార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ సీజన్‌కు గాను జిల్లాలో 1.05 లక్షల కార్డులు జారీచేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈనెల 11 నాటికి 3,720 కార్డులను మాత్రమే జారీ చేయడం గమనార్హం. వీటిలో భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో 26,699 కార్డులకు గాను 1,219 కార్డులు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 40,004 కార్డులకు 1,007 కార్డులు, నరసాపురం డివిజన్‌లో 38,297 కార్డులకు 1,494 కార్డులు మాత్రమే జారీ చేశారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో జూన్ నెలాఖరవు నాటికి కార్డులు జారీచేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించే దిశగా రెవెన్యూ, వ్యవసాయశాఖలు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదలపై మార్గదర్శకాలు రానప్పటికీ ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఈ పథకం లబ్ధి కోసం జిల్లాలో ఇప్పటివరకు 1.05 లక్షల మంది రైతులు ఈకేవైసీ పూర్తిచేసుకున్నారు. కాగా కౌలు గుర్తింపు కార్డుల జారీ జాప్యం వలన అన్నదాత సుఖీభవ నిధులు జమైతే కౌలు రైతులు నష్టపోయే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క గత సీజన్‌లో కేవలం 43,500 మంది కౌలు రైతులకు రూ.238 కోట్లు పంట రుణాలుగా అందించగా, ఈ సీజన్‌లో రూ.400 కోట్లు రుణ లక్ష్యంగా నిర్ణయించారు. త్వరితగతిన కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు.

కౌలు రైతులకు అండగా జగన్ సర్కారు

కౌలు రైతులకు జగన్ సర్కారు కొండంత అండగా నిలిచింది. భూ యజమానుల హక్కులకు భంగం కలుగకుండా కేవలం 11 నెలల కాలానికి సాగు ఒప్పందం చేస్తూ 2011 కౌలు చట్టాన్ని సవరించింది. ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఒకసారి జారీచేసిన కార్డును మరలా యజమాని అంగీకారం మేరకు రెన్యూవల్ చేసుకునే వీలు కల్పించారు. భూ యజమానుల్లో అపోహలు తొలగడంతో జిల్లాలో సీసీఆర్‌సీ కార్డుదారుల జారీ గణనీయంగా పెరిగింది. 2023–24 సీజన్‌లో లక్ష్యానికి మించి 89,589 కార్డులు జారీచేశారు. అసలు రైతుల మాదిరి కౌలు రైతులకు రూ.317 కోట్లు పంట రుణాలను అందించడంతో పాటు రైతు భరోసా, పంటల బీమా పరిహారం అందించి అండగా నిలిచింది. క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్ (సీసీఆర్‌సీ) జారీలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

మండలాల వారీగా కౌలు గుర్తింపు కార్డుల వివరాలు

మండలం	లక్ష్యం	జారీ
ఆకివీడు	2,164	170
భీమవరం	2,867	265
గణపవరం	5,000	567
కాళ్ల	1,848	26
పాలకోడేరు	4,613	46
ఉండి	4,357	38
వీరవాసరం	5,850	107
అత్తిలి	8,100	15
ఇరగవరం	6,916	43
పెంటపాడు	9,084	179
తాడేపల్లిగూడెం	9,654	384
తణుకు	6,250	386
ఆచంట	5,591	372
యలమంచిలి	3,450	215
మొగల్తూరు	550	43
నరసాపురం	4,750	21
పాలకొల్లు	5,497	177
పెనుగొండ	5,645	192
పెనుమంట్ర	6,500	291
పోడూరు	6,314	183

మా భూములు మాకే ఉంచండి

- సాధికారత కమిటీకి సమస్యలు వివరిద్దాం
- కొల్లేరు రైతుల పిలుపు



మాట్లాడుతున్న కొల్లేరు రైతులు, నాయకులు

ఆకివీడు: 'కొల్లేరు సరస్సు తీరంలోని మా భూముల్ని మాకే ఉంచండి!, మేం ఇక్కడే బతుకుతాం, ఎక్కడికో వెళ్లి బతకలేం. కొల్లేరు పక్షులతోనే కలిసి జీవిస్తాం, పర్యావరణాన్ని పరిరక్షిస్తాం. మా మట్టి వాసన మేమే పీల్చుకుంటాం.' అంటూ కొల్లేరు తీర ప్రాంత జిరాయితీ, డీఫారం పట్టా రైతులు మొరపెట్టుకున్నారు. దుంపగడపలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంట్రామరాజు (తాడినాడ బాబు) మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మూడు జీఓలు కొల్లేరు తీర ప్రాంతాల్లోని ప్రజలు, రైతులకు జీవన్మరణ సమస్యగా మారాయన్నారు. ఈనెల 16,17,18 తేదీల్లో కేంద్ర సాధికారత కమిటీ కొల్లేరులో పర్యటించనుందని, తమ గోడు వినిపించేందుకు ప్రజలు, రైతులు నివేదికతో సిద్ధం కావాలన్నారు. కొల్లేరు తీర గ్రామ రైతు సంఘ నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు మాట్లాడుతూ కొల్లేరు తీరంలోని సిద్ధాపురంలో జిరాయితీ భూమి అధికంగా ఉందని, అభయారణ్య పరిధిలోని ఈ భూములకు విలువలు పడిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. సర్పంచ్‌లు చిగురుపాటి చిట్టిబాబు, ముద్దే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు సరిహద్దులో ఉన్న తమ గ్రామాల ప్రజలు అధికంగా నష్టపోతున్నారన్నారు. తమ భూములు తమకే కేటాయించాలని కోరారు. రైతులు గొట్టుముక్కల లక్ష్మీ నర్సింహరాజు, భూపతిరాజు రంగరాజు, నేరెళ్ల పెదబాబు, గంగాధరరావు,కొట్టు ఆంజనేయులు, మాణిక్యాలరావు, దాట్ల రామరాజు, సీపీఎం కార్యవర్గ కార్యదర్శి బి.బలరామ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తాగునీటి చెరువు శుభ్రం



రావిపాడులో చెరువును శుభ్రం చేస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

పెంటపాడు: 'తాగునీటి కుళాయిల నుంచి కలుషిత జలాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రావిపాడులో నాచుతో అడుగంటిన చెరువులను శనివారం సుమారు 50 మంది కూలీలతో శుభ్రం చేయించారు. సమీపంలోని వెంకయ్య వయ్యేరు నుంచి మోటార్ ద్వారా చెరువులోకి నీరు తోడిస్తున్నారు. రెండు రోజుల్లో కొండేపాడు, రావిపాడు గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని గ్రామ కార్యదర్శి శేఖర్‌బాబు తెలిపారు.

నిరవధిక కోత.. ప్రజలకు వ్యథ

భీమవరం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతల కారణంగా శనివారం ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురయ్యారు. విద్యుత్ లైన్ల అనుసంధానం కారణంగా జిల్లాలో శని, ఆదివారాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు ముందుగానే ప్రకటించినా ఉదయం 8 గంటల నుంచి నిరవధికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మధ్యాహ్నం 1 గంటకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ప్రకటించిన అధికారులు సాయంత్రం 4 గంటల వరకు ఇవ్వకపోవడం గమనార్హం. ఓ పక్క విద్యుత్ కోత మరోపక్క ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు. విద్యుత్ సరఫరాలో జాప్యానికి కారణాలు తెలుసుకునేందుకు ఆ శాఖ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించ లేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

'తల్లికి వందనం'లో షరతులు తగవు



మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం తొలి అడుగులోనే పలు షరతులు పెట్టడం అన్యాయమని, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరామ్ డిమాండ్ చేశారు. శనివారం భీమవరంలో చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి, ఇప్పుడు నిబంధనల పేరుతో బాగా కుదించడం దారుణమన్నారు. పథకం లబ్ధిలో రూ.2 వేల పాఠశాలల అభివృద్ధి పేరుతో మినహాయించడం అన్యాయమన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలు, రైతుల ధాన్యం బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని వాస్తవ కౌలుదారులకు ఇవ్వాలన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కర్రా నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 77 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో శనివారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షలకు 77 శాతం అభ్యర్థులు హాజరైనట్లు డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. ఉదయం సెషన్‌లో 100 మందికిగాను 77 మంది అభ్యర్థులు హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో డీఎస్సీ పరీక్షలకు 341 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 167 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 205 మందికి 174 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

పాలకోడేరులో అధిక వర్షపాతం

భీమవరం: జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం నమోదైంది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వర్షం కొన్నిచోట్ల భారీగా, మరి కొన్నిచోట్ల మోస్తరుగా పడింది. పాలకోడేరు మండలంలో అత్యధికంగా 78 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా వీరవాసరంలో 50.2, భీమవరంలో 47.8, మొగల్తూరులో 33.2, నరసాపురంలో 31.6, ఉండిలో 8.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆదరణ కోల్పోయిన కూటమి ప్రభుత్వం



ముదునూరిని మర్యాదపూర్వకంగా కలిసిన భీమవరం కన్వీనర్ చినిమిల్లి వెంకటరాయుడు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

నరసాపురం: కూటమి ప్రభుత్వం ప్రజల్లో క్రమంగా ఆదరణ కోల్పోతుందని, హామీలను పూర్తిగా విస్మరించిన ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. భీమవరం నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌గా నియమితులైన చినిమిల్లి వెంకటరాయుడు శనివారం ప్రసాదరాజును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తనను భీమవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినందుకు చినమిల్లి కృతజ్ఞతలు తెలిపారు. ముదునూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకూ ప్రజల పక్షాన పోరాడాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. హామీలను నూరు శాతం అమలు చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీకి, మాజీ సీఎం జగన్‌కి ఉందన్నారు. బూటకపు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చరిత్ర కూటమి ప్రభుత్వానిదన్నారు. భీమవరంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చినమిల్లికి సూచించారు. పార్టీ నరసాపురం మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్, మైలాబత్తుల శ్రీను, సమన్వయ కమిటీ సభ్యుడు కావలి నాని ఉన్నారు.

మంత్రి ఇలాకా.. పూడికతీతల్లో మెలిక

సాక్షి టాస్క్‌ఫోర్స్: మంత్రి ఇలాకాలో మైనర్ డ్రెయిన్లలో పూడికతీత పనులు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపించేలా కనిపిస్తున్నాయి. వేసవి కాలమంతా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించి వర్షాలు మొదలైన ప్రస్తుత తరుణంలో డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టడంపై రైతులు విస్మయం చెందుతున్నారు. పనుల జరుగుతున్న తీరును చూస్తే చిన్నపాటి యంత్రం తీసుకువచ్చి డ్రెయిన్ గట్టుకు ఓ వైపు మట్టి పెకిలించి బిల్లులు చేసుకోవడానికి పెద్ద స్కెచ్ వేసినట్లు అర్థమవుతోంది. శిరగాలపల్లి ఎత్తిపోతల పథకం వద్ద శిరగాలపల్లి మైనర్ డ్రెయిన్ తవ్విన విధానాన్ని చూసి రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. డ్రెయిన్‌కు ఒక పక్కన గట్టు చదును చేసి, డ్రెయిన్ గర్భంలో పిచ్చిమొక్కల్ని కూడా తొలగించకుండా పని ముగించేశారు. ఇక మట్లపాలెం మైనర్ డ్రెయిన్ పనులైతే మరింత విడ్డూరంగా ఉన్నాయి. ఈ మైనర్ డ్రెయిన్ నారినమెరక వద్ద రోడ్డు దాటి 50 మీటర్లు వెళ్లి నక్కల డ్రెయిన్‌లో కలుస్తుంది. రోడ్డు దాటిన తరువాత కేవలం 20 మీటర్లు మాత్రమే తవ్వారు. మరో 30 మీటర్లు తవ్వితే గానీ డ్రెయిన్‌లో నీరు వెళ్లదు. అక్కడ డ్రెయిన్ మొత్తం పూడుకుపోయి ఉన్నా ఒక వైపు మాత్రమే 20 మీటర్లు తవ్వి వదలేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కావడంతో అరకొర పనులు చేసి బిల్లులు మింగేయడానికి పెద్ద స్కెచ్ వేశారంటూ స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శిరగాలపల్లిలో అసంపూర్తిగా డ్రెయిన్ పనులు



నారినమెరక వద్ద పూర్తిగా తవ్వని డ్రెయిన్

ఉపాధి యూనిట్లు స్థాపించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయం నుంచి ఎంటర్‌ప్రెన్యూర్ యాక్షన్ ప్లాన్ (ఈఏపీ) అమలుపై మెప్మా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఉపాధి యూనిట్ల స్థాపనకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అలాగే యూనిట్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాలన్నారు. మెప్మా పీడీ ప్రియంవద, ఏఓ హెబ్సిబా తదితరులు పాల్గొన్నారు.

ఎకోలి వేస్ట్ మేనేజ్‌మెంట్ బెస్ట్

- చెత్త నుంచి సంపద సృష్టిలో సరికొత్త విధానం
- రసాయన పిచికారీతో 21 రోజుల్లో సేంద్రియ ఎరువుగా చెత్త
- పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో పైలెట్ ప్రాజెక్ట్
- కంపోస్టు ఎరువుల తయారీలో నూతన సాంకేతికత
- టన్ను చెత్తకు లీటరు బయో సొల్యూషన్ లిక్విడ్



ఉండి పంచాయతీలో బయో సొల్యూషన్ లిక్విడ్‌తో ఎరువు తయారీ



ద్రావణం తయారీ పరిశ్రమ

కైకలూరు: చెత్త నుంచి సంపద తయారీలో సరికొత్త విధానం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు 17, మున్సిపాలిటీలు 77, నగర పంచాయతీలు 29, గ్రామ పంచాయతీలు 13,325 ఉన్నాయి. రోజూ వేలాది టన్నుల చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరిస్తున్నారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పలు ప్రాంతల్లో నిరూపయోగంగా మారాయి. రోజువారి చెత్త సైతం పేరుకుపోవడంతో డంపింగ్ యార్డులు సరిపోవడం లేదు. పైగా దుర్వాసన కూడిన విష వాయువులతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎకోలి బయో సొల్యూషన్స్‌తో చెత్తను సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారు.

21 రోజుల్లో సేంద్రియ ఎరువు తయారీ

ఎకోలి బయోసొల్యూషన్ పేరుతో మైక్రోబియల్ ఎక్స్ ద్రావణాన్ని తయారుచేస్తున్నారు. టన్ను చెత్తకు లీటరు నుంచి లీటరున్నర ద్రావణాన్ని తడి చెత్తకు పిచికారీ చేస్తున్నారు. కేవలం 21 రోజుల్లో చెత్త సేంద్రియ ఎరువుగా మారుతోంది. అదే వర్మీ కంపోస్టులో ఈ కాలం 90 రోజులుగా ఉంది. పైగా కూలీల ఖర్చు అధికం. లీటరు ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి తడి చెత్తపై ఉపయోగించవచ్చు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి, చినఅమిరం గ్రామాల్లో టన్ను చెత్తపై పైలెట్ ప్రాజెక్టుగా మైక్రోబియల్ ద్రావణాన్ని ఉపయోగించి సత్ఫలితాలు సాధించారు. మరిన్ని పంచాయతీలకు దీనిని విస్తరించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఎరువు తయారీలో బ్యాక్టీరియా కీలకం

మైక్రోబియల్ ఎక్స్ ద్రావణం తయారీకి గుజరాత్ నుంచి మూడు బ్యాక్టీరియాలు కలిగిన నీటిని తీసుకువచ్చి ఉయ్యూరు సమీప పరిశ్రమలో ప్రయోగాత్మకంగా ద్రావణాన్ని తయారు చేశారు. దీనిని తడి చెత్తపై పిచికారీ చేసిన తర్వాత నీటిలోని బ్యాక్టీరియాలు 21 రోజుల్లో చెత్తను తిని విసర్జిస్తాయి. ఇది సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీనిని మొక్కలు పెరుగుదల, ఆక్వా చెరువులు, వరి చేలకు ఉపయోగించవచ్చు. ద్రావణం పిచికారీ చేసిన తర్వాత మూడు రోజుల్లో దుర్వాసన సైతం ఉండదు. లీటరు ద్రావణం తక్కువ ధరకే లభిస్తుంది.

రసాయనాలను గుర్తించే ఓడోమెన్ డివైజ్

డంపింగ్ యార్డుల వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసనతో వాతావరణం కలుషితమవుతోంది. గాలిలో వాయువుల పరిస్థితిని తెలుసుకోడానికి ఓడోమెన్ డివైజ్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుత ఉష్ణోగ్రత, తేమ, హైడ్రోజన్, సహజ వాయువుల శాతాన్ని తెలుసుకుంటున్నారు. దీని ప్రకారం గాలి నాణ్యత, కుళ్లిపోయే చెత్త పురోగతిని అంచనా వేస్తున్నారు. దీనిని డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేసి మిథిన్ వంటి ఉద్గారాలను తగ్గించడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించే అవకాశం కలుగుతుంది.

స్వచ్ఛ భారత్ వైపు అడుగులు




వ్యర్థాలను పూడ్చటం, దహనం చేయడం వల్ల హానికర కాలుష్య కారకాలు విడుదలవుతాయి. ఎకోలి బయో సొల్యూషన్స్ ద్రావణాన్ని చెత్తపై పిచికారీ చేస్తే ఎటువంటి దుర్వాసన లేకుండా కంపోస్టు ఎరువు తయారవుతుంది. చేపల చెరువులకు సైతం దీనిని ఉపయోగించవచ్చు. కైకలూరు ప్రభుత్వ మత్స్యశాఖ లేబోరేటరీ ఎరువులో పోషకాలను పరీక్షించి గుర్తింపు పత్రం ఇచ్చింది. పంచాయతీలు, మున్సిపాలిటీలకు ద్రావణాన్ని తక్కువ ధరకు అందిస్తున్నాం.

– నడింపల్లి మణిరాజు, ఎకోలి బయో సొల్యూషన్స్, భీమవరం

నీకు 15.. నీకు 15.. అని

13 వేశారేంటి?



గుడాల గోపి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి

పాలకొల్లు సెంట్రల్: నాడు ఎన్నికల ముందు నీకు 15.. నీకు 15.. నీకు 18 అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నీకు 13 దగ్గరే ఆగిపోయిందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు నేడు కొందరికే రూ.13 వేలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అన్నమాట నిలబెట్టుకోవడం చేతకాని కూటమి ప్రభుత్వం ఇప్పుడేమి సమాధానం చెబుతుందన్నారు. పాఠశాలల నిర్వహణ నిమిత్తం అంటూ మినహాయించిన రూ.2 వేలను ప్రభుత్వమే పాఠశాలల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జగన్ అమ్మఒడి పథకం ద్వారా స్కూల్ అభివృద్ధికి రూ.1,000 కట్ చేస్తే అన్యాయం అంటూ గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు ఇప్పుడు రూ.2,000 ఎలా మినహాయిస్తున్నారని ప్రశ్నించారు. తల్లికి వందనం లబ్ధి గత సంవత్సరానిదా లేక ఈ సంవత్సరానిదో చెప్పాలన్నారు. అందరు పిల్లలకు నగదు వేస్తామని చెప్పి ఇంటికి ఒక్కరికే వేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. అలాగే కూటమి ఏడాది పాలనలో నిరుద్యోగ భృతి ఎంతమందికి ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో తలమునకలైన మంత్రి లోకేష్ కొద్దిగా విద్యార్థులపై కూడా దృష్టి పెట్టాలన్నారు.

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అవార్డు



మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రామ భద్రిరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ రాష్ట్రంలో అత్యధిక రక్త యూనిట్లు సేకరించిన సంస్థగా రెండో స్థానం సాధించింది. ఈ సందర్భంగా గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌కు పురస్కారం లభించడం అభినందనీయమని జిల్లా శాఖాధ్యక్షుడు రామ భద్రిరాజు అన్నారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



ఎన్నార్పీ అగ్రహారంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయపడిన మహిళ

ఉండి: ఆసుపత్రికి వెళ్తున్న వృద్ధ దంపతులను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై స్థానికులు, బాధితురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం గణవరానికి చెందిన రిటైర్డ్ టీచర్ గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు తన భార్య సావిత్రితో కలసి బైక్‌పై భీమవరంలో ఆసుపత్రికి వెళ్తున్నాడు. ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే నర్సాపురం డిపోకు చెందిన బస్సు లారీని ఓవర్ టేక్ చేయబోయి బైక్‌ను ఢీకొట్టింది. వెనుక కూర్చున్న మహిళ పట్టుతప్పి ఆర్టీసీ బస్సు వెనక చక్రం కింద పడిపోయింది. ఇంతలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో 108లో ఆమెను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలికి వచ్చి వివరాలు సేకరించారు.

వివాహిత ఆత్మహత్య

ఆగిరిపల్లి: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వట్టిగుడిపాడులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై శుభశేఖర్ వివరాల ప్రకారం వట్టిగుడిపాడుకు చెందిన రాంబాబు, నాగ తేజస్వినికి(21) మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో 50 సెంట్లు కట్నంగా ఇచ్చారు. సంవత్సరం క్రితం తండ్రి కూతురి భూమి పట్టాలను బ్యాంకులో తనఖా పెట్టాడు. శుక్రవారం కూతురు తేజస్విని తండ్రి తనఖా పెట్టిన భూమిని విడిపించి ఇవ్వాలని అడగ్గా తండ్రి కొంత సమయం కావాలనడంతో తేజస్విని మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15 కోట్ల బిల్లులు పెండింగ్

ట్రిపుల్ ఐటీల మెస్ నిర్వాహకుల గగ్గోలు

నూజివీడు: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న మెస్ నిర్వాహకులకు రూ.కోట్ల మెస్ బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తుండంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. నెలల తరబడి మెస్ బిల్లులు చెల్లించకుండా జాప్యం చేయడంతో.. అప్పుల పాలవుతున్నామని లబోదిబోమంటున్నారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని మెస్ నిర్వాహకులకు దాదాపు రూ.15 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనిపై నిర్వాహకులు పలుమార్లు ఆర్జీయూకేటీ అధికారులను కలిసి బిల్లులు విడుదల చేయాలని విన్నవించుకున్నా రూపాయి కూడా విడుదల చేయడం లేదు. దీంతో జూలై 1 నుంచి వేసవి సెలవుల అనంతరం ట్రిపుల్ ఐటీల్లో తరగతులు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో మెస్‌ల నిర్వహణ ఎలా అని తలలు పట్టుకుంటున్నారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఉన్న 26,400 మంది విద్యార్థులకు 11 మంది మెస్ నిర్వాహకులు భోజనాన్ని తయారు చేసి అందజేస్తున్నారు. ఈ మెస్‌లలో కొన్నింటికి గతేడాది సెప్టెంబరు నుంచి మరికొన్నింటికి నవంబరు నుంచి, ఇంకొన్నిటికి జనవరి నుంచి ట్రిపుల్ ఐటీలకు వేసవి సెలవులు ఇచ్చే నాటి వరకు మెస్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రతి రోజూ ఒక్కొక్క మెస్ కనిష్టంగా 2 వేల మంది నుంచి 6 వేల మందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంకాలం స్నాక్స్ అందిస్తోంది. ఇంత భారీ మొత్తంలో మెస్‌లు నిర్వహిస్తున్న వీరికి పెట్టుబడి సైతం ఎక్కువగానే ఉంటుంది. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి సరుకులు తెచ్చి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వండి పెడుతున్నారు. అయినప్పటికీ ఆర్జీయూకేటీ అధికారులు మెస్ నిర్వాహకులకు బిల్లులు సకాలంలో చెల్లించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు.



నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు(ఫైల్)

బిల్లుల అప్‌లోడ్‌లో తీవ్ర జాప్యం

నెల గడవగానే ఆ నెలకు సంబంధించిన బిల్లులను సీఎంఎఫ్ఎస్‌లో అప్‌లోడ్ చేయడంలో ట్రిపుల్ ఐటీల సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారని మెస్ నిర్వాహకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఈ బిల్లుల అప్‌లోడ్ బాధ్యతలను అవుట్ సోర్సింగ్ స్టాఫ్‌కు అప్పగించడంతో వారు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆరు నెలలు, ఎనిమిది నెలల పాటు బిల్లులు చెల్లించకపోవడంతో మెస్ నిర్వాహకులు కోట్లాది రూపాయల అప్పుల్లో మునిగిపోయారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో కేఎంకే సంస్థకు దాదాపు రూ.2.50 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో రూ.1.75 కోట్లు, ఎస్ఎస్ క్యాటరర్స్‌కు రూ.2.10 కోట్లు, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఫుడ్‌సూత్ర హాస్పటాలిటీకి రూ.2.10కోట్లు, శ్రీదేవి క్యాటరర్స్‌కు రూ.1.40కోట్లు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో సరోజ క్యాటరర్స్‌కు రూ.1.50 కోట్లు, ప్రిజం హాస్పటాలిటీకి రూ.1.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇంకా పలువురు నిర్వాహకులకు మెస్ బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఎప్పుడు చెల్లిస్తారో అంతుబట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మెస్ బిల్లులు చెల్లించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

కల్తీ విత్తనాలతో జాగ్రత్త!

రైతులకు వ్యవసాయాధికారుల సూచన

బుట్టాయగూడెం : తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కల్తీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టం– 1985 ప్రకారం నిబంధలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

విత్తనాల కొనుగోలులో..

వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సీల్ వేసిన ధృవీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తనాల రకం, ల్యాబ్ నెంబర్, గడువు తేదీ, తదితర విషయాలను గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలి. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. హైబ్రిడ్ విత్తనాల కొనుగోలుకు విత్తన రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలు పరిశీలించాలి. మొలకెత్తిన దశ, పూత దశలో లోపం కనిపిస్తే స్థానిక వ్యవసాయ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలి.

మొలకలను పరీక్షించే విధానం

రైతులు విత్తుకోవడానికి ఒకరోజు ముందు విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల మొలక పరీక్షలు చేయించుకోవడం లేదు. విత్తనం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా మొలకలను పరీక్ష చేయించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటలపాటు నీటిలో నానబెట్టి అనంతరం ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజలపైనే మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని నారుమడులు సిద్ధం చేసుకోవాలి. మొలక శాతం కనీసం 75 శాతం వరకూ ఉంటే విత్తనాలు నాణ్యమైనవని భావించి పంటలు విత్తుకోవాలి.



బుట్టాయగూడెంలోని షాపులో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

గడువు దాటితే కొనుగోలు చేయొద్దు

కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా డబ్బాపై సీలు ఉందా? లేదా? అనేది నిర్ధారించుకోవాలి. అరువు పద్ధతిలో విత్తనాలు కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

మంచి విత్తనాలతోనే నారు కట్టాలి



సొంతంగా తయారు చేసిన విత్తనాలు నారుకు శ్రేయస్కరం. కొనుగోలు చేస్తే మంచి విత్తనాలను ఎంపిక చేయాలి. నారుపోసే ముందు మొలక శాతం గుర్తించి నారు పోయాలి. ఎలాంటి సమస్యలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

– పీజీ బుచ్చిబాబు, సహాయ వ్యవసాయ సంచాలకుడు, కేఆర్‌పురం

కొంతేరులో మహిళ ఆత్మహత్య

కుమారుడి ప్రియురాలి ఇంటిముందు మృతదేహంతో ఆందోళన

యలమంచిలి: కొడుకు ప్రేమలో విఫలమై ఆత్మహత్య చేసుకోగా.. కొడుకు ప్రియురాలి కుటుంబ సభ్యులు కోర్టు కేసులు వేసి తనను వేధిస్తున్నారని.. కడుపు కోతను, కోర్టు కేసులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సూసైడ్ నోట్ రాసి మహిళ శనివారం కొంతేరు గ్రామంలో ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె మృతదేహాన్ని ప్రియురాలి ఇంటి ముందు ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భీమవరం గ్రామానికి చెందిన చింతా లక్ష్మీ నర్సమాంబ భర్త చనిపోవడంతో పుట్టిల్లు కొంతేరు వచ్చి స్థిరపడింది. ఇద్దరు కుమారులను కష్టపడి ఇంజినీరింగ్ చదువించింది. వారిలో లికిల్ సాయి సమీపంలో ఉంటున్న అమ్మాయిని ప్రేమించాడు. వారిద్దరికి గొడవ జరగడంతో వీడియో కాల్‌లో ఆ అమ్మాయితో మాట్లాడుతూనే ఉరి వేసుకుని గత డిసెంబరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంలో తన కుమార్తెను అల్లరిపాలు చేస్తున్నారంటూ ఆ అమ్మాయి తండ్రి వారిపై పోక్సో కేసు నమోదు చేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకవైపు కొడుకు మరణం, మరోవైపు కోర్టు కేసులతో నర్సమాంబ మనస్తాపం చెంది శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన ఆత్మహత్యకు అడ్డాల నాగేశ్వరరావు కుటుంబమే కారణమని ఆరోపిస్తూ నర్సమాంబ సూసైడ్ నోట్ రాసింది. ఈ సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.



కొంతేరులో మహిళ మృతదేహంతో ఆందోళన

మోసగించిన కేసులో వ్యక్తి అరెస్టు

భీమవరం: ప్రేమ పేరుతో మోసగించిన కేసులో మహ్మద్ అబ్దుల్ సమీర్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. భీమవరం పట్టణానికి చెందిన యువతికి ఇన్‌స్టాగామ్‌లో సమీర్ పరిచయమై ప్రేమిస్తున్నాని నమ్మించి ఆమె ఫోటోలను మార్ఫింగ్ చేసి డబ్బుల కోసం వేధించడంతో యువతి ఫిర్యాదు చేసింది. నిందితుడిని శనివారం మధ్యాహ్నం గునుపూడి అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

పోషకాల మేతతో మంచి దిగుబడి

చింతలపూడి: పాడి పశువులకు పుష్టికరమైన మేత అందించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. నాణ్యమైన మేత అందించడం కారణంగా పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. పాల ఉత్పత్తి కూడ గణనీయంగా పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.లింగయ్య తెలిపారు. సాధారణంగా పాడి పశువుల్లో విటమిన్ ఎ, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషక పదార్థాల లోపం వల్ల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. చాలామంది రైతులు వర్షాకాలం, చలికాలంలో పచ్చిమేతలు, ఎండాకాలంలో ఎండు గడ్డిని దాణాగా అందిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. పచ్చిమేత ఎక్కువగా దొరికే కాలంలో దానికి పాతర వేసి నిల్వ చేసుకోవాలని.. అన్ని కాలాల్లో పచ్చిమేత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

పాడి - పంట

ఎంత మేత అవసరం..

రోజూ ఒక్కో పశువుకు 8 కిలోల వరిగడ్డి, లేదా ఎండు చొప్ప(మొక్కజొన్న, జొన్న) 8 కిలోల లెగ్యూమ్ జాతి పచ్చిమేత(పిల్లిపెసర, అలసంద, గోరు చిక్కుడు) 16 కిలోల గింజ జాతి పచ్చి మేతలు ఇస్తే.. పశువులకు అన్ని రకాల పోషకాలు అందుతాయి. పాల దిగుబడిని బట్టి పశువులకు దాణా అందించాలి. పోషకాలతో కూడిన గడ్డిని ఇస్తే సకాలంలో ఎదకు వస్తాయి. పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుంది.



గొడ్డుమోతు సమస్య ఉంటే..

పశువుల్లో గొడ్డుమోతు సమస్యకు సకాలంలో ఎదకు రాకపోవడం, గర్భకోశ వ్యాధులు, అండంలో లోపాల వల్ల ఈ సమస్య అధికంగా ఉంటుంది. పశువులు ఈనిన తరువాత పశువులు 60 నుంచి 90 రోజుల్లో ఎదకు వచ్చి చూలు కట్టాలి. ఎదకు రాని పశువులను సకాలంలో పశు వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్ళి పరీక్ష చేయించాలి. ప్రతీ రోజు ఎద లక్షణాలను పరిశీలించి కృత్రిమ గర్భధారణ చేయించాలి.

దూడలకు చూడి కట్టించడం సరికాదు

యుక్త వయసు రాని దూడల్ని కత్రిమంగా చూడి కట్టించే పనిని రైతులు మానుకోవాలి. తగిన వయసు, బరువు లేని పశువుల్ని చూడి కట్టించడం వల్ల పశువుల్లో వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ఆవులకు 18 నెలలు, గేదెలకు 24 నెలల వయసు వచ్చిన తరువాత మాత్రమే చూడి కట్టించాలి. ఆవులు 200 కిలోలు, గేదెలు 250–300 కిలోలు బరువు ఉన్నప్పుడు మాత్రమే చూడికట్టించాలి. శారీరకంగా పూర్తిగా ఎదగని పశువులను చూడి కట్టించడం వల్ల కటి వలయం సరైన రీతిలో నిర్మాణం కాక ఈనిక కష్టమవుతోంది. ఒక్కోసారి తల్లి లేదా దూడ లేదా రెండూ మరణించే ప్రమాదం ఉంది. అందు వల్ల రైతులు అశాస్త్రీయమైన పద్ధతులకు స్వస్తి పలికితే పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పశు వైద్యాధికారి సూచించారు.



కె లింగయ్య
పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదపాడు మండలంలోని తాళ్లమూడి వద్ద చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని హుకుంపేటకు చెందిన శిలబోయిన ఫణీంద్ర (34) శనివారం ఉదయం తన బైక్‌పై అడవినెక్కలం నుంచి బయలు దేరాడు. ఉదయం 7.30 గంటల సమయంలో రోడ్డుపై ఆగిఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిల్టు తీస్తుండగా కూలీ మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని స్థానిక 11వవార్డు మహాలక్ష్మి నగర్ డ్రెయినేజీలో శనివారం సిల్టు తీస్తుండగా తమ్మిశెట్టి శ్రీను (55) కింద పడిపోయాడు. అతనిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీను గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కమిషనర్ యేసుబాబు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో మున్సిపాల్టీ పరిధిలో డ్రెయినేజీల నుంచి సిల్టు తీసే కార్యక్రమాలు చేపట్టలేదని, ఆ ప్రాంత స్థల యజమానులు పనులు చేయించుకుంటున్నారన్నారు. కూలీ మృతిపై పూర్తి బాధ్యత ఆ స్థల యజమానులే తీసుకోవాల్సి ఉందని చెప్పారు.

కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలో భక్తుల రద్దీ




శ్రీవారి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగియడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, అనివెట్టి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. దేవస్థానం సిబ్బంది భక్తులకు క్యూ కాంప్లెక్స్‌లో నిరంతరాయంగా మజ్జిగ, మంచి నీటిని అందించారు. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. కొండపైన ఘాట్ రోడ్లు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

నటుడు అల్లం గోపాలరావు మృతి

భీమడోలు : సినీ, టీవీ ఆర్టిస్ట్ అల్లం గోపాలరావు(75) శనివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన ఆయన మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాలరావుకు ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం స్నేహితుడు. ఆయన సహకారంతో రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్ వెళ్లి టీవీ, సినిమాల్లో నటించి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గోపాలరావు భీమడోలులోని సుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా పని చేసేవారు. గ్రామంలోని గురజాడ కళావేదిక వద్ద క్రీడా పోటీలు నిర్వహించేశారు. అభ్యుదయ వాదిగా అనేక చైతన్య కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు చేశారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నాటికలు, ప్రదర్శనలు ఇచ్చారు.



అల్లం గోపాలరావు (ఫైల్)

గోపాలరావు మృతికి నివాళి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గోపాలరావు మృతికి సీపీఐ, ప్రజా నాట్యమండలి, బీకేఎంయూ జిల్లా సమితులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ప్రజా నాట్యమండలి ఏలూరు ఏరియా కార్యదర్శి తమ్మా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గోపాలరావు తొలినాళ్లలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్య మండలిలో ప్రముఖ పాత్ర నిర్వహించారన్నారు. సమాజంలో మార్పునకు కృషి చేశారన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన గోపాలరావు మృతి కళా రంగానికి తీరని లోటన్నారు.

బంగారం, నగదు అపహరణ

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం దొంగలు పడి బంగారం, నగదు అపహరించుకుపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం యనమదుర్రు గ్రామానికి చెందిన అన్నమ్ రామచంద్రుడు ఇంటికి తాళాలు వేసి ఈ నెల 11న హైదరాబాద్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. 13న ఇంటి పొరుగువారు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయన్న సమాచారాన్ని రామచంద్రుడికి అందించడంతో వచ్చి చూడగా తలుపులు పగలగొట్టి బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నాయి. 16 కాసుల బంగారం, వెండి వస్తువులు, కొంత నగదును గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారనే ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతురాలు రీతు

పాలకొల్లు సెంట్రల్: పెళ్లికి హైదరాబాద్ వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడి చికిత్స పొందుతున్న భార్య కుంపట్ల రీతు (41) శనివారం మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం సంగమూడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంపట్ల రాంగోపాల్ (పెద్దరాజా) అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రీతు, పాప ప్రణవి, కుమారుడు రాములను భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రీతును శుక్రవారం హైదరాబాద్ తరలించగా శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్యాభర్తల మృతితో బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన పెమ్మాడి దయామణి (38) గల్ఫ్ నుంచి 20 రోజుల క్రితం సొంతూరు వచ్చింది. శనివారం మొగల్తూరు మండలంలోని కొత్తాటలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి సొంతూరు కొత్తపూసలమర్రుకు బంధువు ద్విచక్రవాహనంపై వస్తుండగా లోసరి పంచాయతీ గరవల్ల దిబ్బ వద్ద వెనుకనుంచి లారీ ఢీకొనడంతో దయామణి మృతిచెందింది. ఆమె భర్త గతంలో మృతి చెందాడు. ఇద్దరు ఆడపిల్లలున్నారు.

కోడి వ్యర్థాల వాహనం సీజ్

దెందులూరు: జాతీయ రహదారి మీదుగా చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న రవాణా వాహనాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. శనివారం ఉదయం తనిఖీల్లో భాగంగా చికెన్ వ్యర్థాలతో వెళుతున్న వ్యాన్‌ను పట్టుకున్నారు.హైదరాబాద్ నుంచి గుండుగొలను వైపు వెళ్తున్న వ్యానును దెందులూరు ఎస్సై శివాజీ తనిఖీ చేయగా.. తనిఖీ చేయగా కోళ్ల వ్యర్థాలు బయటపడ్డాయి. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

రహదారులపై కానరాని హెచ్చరిక బోర్డులు



అత్తిలి మండలం బల్లిపాడు మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



అత్తిలి మండలం ఆరవల్లిలో మాముడూరు-ముప్పర్తిపాడు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న వంతెన మలుపు

- భద్రత గాలికి!
- తరచూ ప్రమాదాలు

అత్తిలి: ప్రతి ఏటా ప్రమాదాలు జరగకుండా ఆర్టీఓలు, పోలీసులు, పలుశాఖల అధికారులు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రహదారుల్లో ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడుపుతున్న డ్రైవర్ల వద్ద ఎటువంటి ధ్రువపత్రాలు ఉండడం లేదు. అనుభవం లేని డ్రైవర్లు, మద్యం సేవించి వాహనాలు నడపడం, కొన్ని వాహనాలకు ఎటువంటి ఫిటినెస్ లేకపోవటం మితిమీరిన జనాలతో ప్రయాణాలు చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

బోర్డులు కరువు..

రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. ముఖ్యంగా మలుపులు, జంక్షన్లు, స్కూల్ జోన్లు, ఇరుకైన బ్రిడ్జీల ఉన్నచోట్ల బోర్డులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేడియం స్టిక్కర్ల బోర్డులు లేకపోవడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త రహదారుల్లో ప్రయాణాలు చేసేవారు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. తణుకు- భీమవరం, అత్తిలి- అలంపురం, ఉరదాళ్లపాలెం-దువ్వ ఆర్అండ్‌బీ రహదారిలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈమలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల రేలంగి శివారు గవర్లపాలెం నుండి కె సముద్రపుగట్టు వరకు బీటీ రోడ్డును నిర్మించారు. ఇటీవల ఈమార్గంలో వెళుతున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టిన సంఘనట జరిగింది. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు మలుపుల వద్ద, కాలువ వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అత్తిలి- అలంపురంలో మార్గంలో అదుపుతప్పి మురుగు డ్రెయిన్‌లోకి పల్టీకొట్టిన కారు

భయంభయంగా ప్రయాణం



రహదారిపై వాహనం తీస్తే భయమేస్తుంది. ఎవరు ఏ పక్క నుంచి వచ్చి ఢీకొడతారన్న భయంతో వణికిపోతున్నాం. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడంవలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలి.

– కంకటాల సతీష్, అత్తిలి

శిక్షలు కఠినంగా ఉండాలి



ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారు ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలి. నిబంధనలు ఉల్లంఘించినవారి వాహన, లైసెన్స్, రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి. శిక్షలు కఠినంగా ఉంటేనే ప్రమాదాలు తగ్గుతాయి.

– సబ్బితి రాజేష్, అత్తిలి

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో రెండోవ శనివారం స్కూల్స్, కళాశాలలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కూల్, కళాశాలలు వద్ద నిరసన ప్రదర్శనలు చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు పతివాడ నాగేంద్ర బాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్స్, కళాశాలలు పనిచేస్తున్నాయని ప్రభుత్వ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా, పట్టణ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. దీంతో కళాశాల యాజమాన్యం విద్యార్థులను పంపించి వేశారు. నిరసన కార్యక్రమం ముగిసింది. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు గణేష్, మణికంఠ కేశవ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీవీఆర్ కళాకేంద్రంలో నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ సాంస్కృతిక సమాహారంను విజయవంతం చేయాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ, అధ్యక్షుడు సిరిమామిళ్ళ పెద్దిరాజు, ఎన్‌వీ రమణారావులు వెల్లడించారు. సభా కార్యక్రమానికి బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించనున్నారు. గౌరవ పురస్కారం టెక్నికల్ ఏఈఈ రెడ్డి సుబ్రహ్మణ్యం, కళా పురస్కారం భజన కళాకారుడు అంబటి వెంకట తాతారావు, ఆర్థిక సత్కారం పేద కళాకారుడు ఆలపాడుకు చెందిన బి.త్రినాథ్‌రాజుకు జరగనున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అభయ గణపతికి పంచామృత అభిషేకాలు



విశేష అలంకరణలో అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జ్యేష్ట బహుళ సంకటహర చవితి పురస్కరించుకుని శనివారం రాత్రి స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో నెలవైయున్న అభయ గణపతికి ఆలయ అర్చకులు ఇవటూరి శశికాంత్ శర్మచే పంచామృతాలతోను, వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో ఏకాదశ అభిషేకం, సహస్రనామ అర్చనలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పుష్పమాలలు అలంకరణలు చేశారు. దూర్వాంకురాలు, శ్వేతార్క పుష్పాలతో పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.


యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



గూడెం కోడే వెంకట్రావు హైస్కూల్లో యోగా తరగతులు నిర్వహిస్తున్న శిక్షకురాలు రూప

పెంటపాడు: యోగా ద్వారానే ఆరోగ్యం సమకూరుతుందని యోగా శిక్షకురాలు జి.రూప పేర్కొన్నారు. శనివారం గూడెంలోని కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలువురికి శిక్షణ అందజేశారు. యోగాలోని మెళకువలను నేర్పారు. చక్కెర వ్యాధి, కీళ్ల వ్యాధులు, మోకాళ నొప్పులు యోగా ద్వారా అదుపులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సచివాలయం, స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

మారంపల్లి కాలువకు నీరు విడుదల



కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్న శెట్టిపేట నీటి సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి కెనాల్ నుంచి నీటిని శెట్టిపేట నీటి సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సాగు అవసరాలకు ఈ నీరు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. శివారు ప్రాంత రైతాంగానికి నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉప సర్పంచ్ అరసాల సుబ్బారావు, టీసీ సభ్యుడు సారిక శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బెజవాడ శ్రీను, గూడవల్లి శ్రీనివాసరావు, సాదుల శ్రీనివాసరావు, గొర్రిపూడి అప్పారావు, రైతులు రాయుడు వల్లయ్య, సారిక శ్రీనివాసరావు, కంఠమని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు మామిడిపండ్ల అలంకరణ

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వరస్వామిని శనివారం మామిడిపండ్లతో ఆలయ అర్చకుడు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

రక్తదాతలకు సత్కారం

భీమవరం: రక్తదానం పట్ల అపోహలు విడనాడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎక్కువ పర్యాయాలు రక్తదానం చేసిన బోడపాటి పెదబాబు, కొప్పినిడి బాబీ, కేవీఎల్ నర్సింహరావు, చల్లా రాము, చీడే చందులను ఎమ్మెల్యే సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: సీజనల్‌గా వచ్చే దోమ జనిత వ్యాధులైన మలేరియా, చికెన్‌గున్యా బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు సూచించారు. తణుకు మండలం వేల్పూరులో శనివారం నిర్వహించిన మలేరియా నివారణ మాసోత్సవం 2025 అవగాహన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యంగా గృహాల ఆవరణల్లో అనవసరమైన కదలిక లేని నీటి నిల్వలు అత్యంత ప్రమాదకరమని, దోమల ఆవాసాలని స్పష్టం చేశారు. రోజుల తరబడి ఉండే నీటి నిల్వల్లో దోమలు లార్వా పెట్టడం ఆతరువాత దోమగా మారడంతో దోమకాటుతో వ్యాధులు సంక్రమిస్తాయని అన్నారు. ఆవరణలో ఉన్న నిరుపయోగ సామగ్రిని పరిశీలించుకుని, తొలగించుకోవాలని, నీటి నిల్వపెట్టుకున్న పాత్రలపై విధిగా మూతలు ఉంచాలని, జ్వరం వచ్చిన సందర్భాల్లో సమీపంలోని వైద్యులను సంప్రదించాలని చెప్పారు. వ్యాధుల నిర్మూలనకు ఒకే ఒక్క మార్గం ఖర్చు రహిత డ్రైడేగా పాటించడమేనన్నారు. దోమలు కుట్టకుండా స్లీవ్ దుస్తులు ధరించాలని, దోమ తెరలు వాడాలని, ఇండ్ల ఆవరణలో దోమ వికర్షకాలైన బంతి, పుదీనా వంటి మొక్కలను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎ.శ్రీరామమూర్తి, తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, విలేజ్ హెల్త్ సెక్రెటరీ సీహెచ్ కనకమేరీ, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వేల్పూరులో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు

మాజీ మంత్రి కారుమూరి పరామర్శలు

తణుకు అర్బన్: ఇటీవల మృతి చెందిన తణుకు మండలం వేల్పూరు గ్రామ మాజీ మునిసిబు పెనుమర్తి వసంతరాయుడు సతీమణి, వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు పెనుమర్తి వెంకటరామన్న మాతృమూర్తి ప్రమీల అలివేలు మంగతాయారు మృతికి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. శనివారం ఆమె నివాసానికి వెళ్లిన కారుమూరి, వెంకటరామన్నతో పాటు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చింతలపూడి సూర్యనారాయణ సతీమణి ఇటీవల మృతిచెందగా కారుమూరి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వేల్పూరు పార్టీ నాయకులు మేకల భాస్కర్ తల్లి శకుంతల ఇటీవల మృతి చెందగా కారుమూరి పరామర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని గిరిరెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని తణుకులోని ప్రైవేటుఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం కారుమూరి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో వేల్పూరు గ్రామ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, వేల్పూరు గ్రామ నాయకులు పాల్గొన్నారు.



వేల్పూరులో ప్రమీల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

చేగువేరా జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

తణుకు అర్బన్: చేగువేరా జీవితం విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి పేర్కొన్నారు. చేగువేరా 97వ జయంతి సందర్భంగా తణుకు ఎస్కేఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతంలో శనివారం చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తిగా నిలిచారని స్పష్టం చేశారు. కాస్ట్రో ప్రభుత్వంలో చేగువేరా పరిశ్రమల శాఖ మంత్రిగా, క్యూబా జాతీయ బ్యాంక్ అధ్యక్షుడుగా అనేక పదవులు చేపట్టారని క్యూబాలో అమెరికా కంపెనీలను జాతీయం చేశారని క్యూబా అక్షరాస్యత 96 శాతం పెంచిన ఘనత చేగువేరాకు దక్కుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ చేగువేరా ప్రత్యక్షమై వారికి అండగా నిలిచేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ ఆసీస్, టి తేజ , ఎం. మోహన్, టి వినయ్, కె. సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



తణుకులో చేగువేరా చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

ఇంద్రజాలికుడు బోస్‌కు సత్కారం

భీమవరం: ప్రముఖ ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ దంతులూరి సత్యనారాయణరాజు(బోస్)ను పాలకొల్లులో «మేజిక్ ఆచార్య» అనే బిరుదుతో సత్కరించారు. పాలకొల్లు పట్టణానికి చెందిన మాసపత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బోస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోస్ మేజిక్ రంగంలో విశిష్ట సేవలందించిన బహుముఖ ప్రజ్ఞావంతుడని కొనియాడారు. దుర్గేష్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు, వంగా నర్సింహారావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో శివాలయ నిర్మాణానికి విరాళం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా సదాశివస్వామి ఆలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆలయానికి ఇప్పటికే పలువురు విరాళాలు అందజేశారు. వీర్ల ధనరాజు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి రూ.1 లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ వీర్ల కృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణకమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా అలంపురం గ్రామానికి చెందిన దెందుకూరి ఆనందరాజు కుమారుడు దెందుకూరి నాగరాజు రూ. 25 వేలు, పెరవలికి చెందిన ఆర్కే రైసుమిల్లు అధినేత నారికడమిల్లి రామకృష్ణ మూర్తి రూ. 1.11 లక్షలు, ప్రత్తిపాడుకు చెందిన పిప్పళ్ల రామయ్య కుమారుడు శాంతారావు రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయన నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి చెక్కు అందజేస్తున్న దాతలు

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం

నరసాపురం: పట్టణం సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ఫ్లాట్‌ఫామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ లోపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్‌రోడ్డులో సెంట్రల్ డివైడర్ల పాతిన మొక్కలు లేకుండా పాడైపోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల మధ్య మొక్కలు లేకుండా పాడైపోయిన దృశ్యం

అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్య



గొల్లలకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు సిబ్బంది

పాలకోడేరు: అంగన్‌వాడీల్లో ఆట పాటలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని, మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని గొల్లలకోడేరులో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అంగన్‌వాడీలో చిన్నారులకు అందించే విద్య, సౌకర్యాలు గురించి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు అక్షర అభ్యాస్యం నిర్వహించి, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, సోనీ, జెమీమా, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, పద్మ, సీత, తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళకూరులో ఎక్సైజ్ దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం విక్రరయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో శనివారం ప్రొహిబిషనరీ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం విక్రయిస్తున్న కోలా ఆంజనేయులును అదుపులోకి తీసుకుని, అతని వద్ద 6 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

రైతులకు చేరని ధాన్యం సొమ్ము

- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

నరసాపురం రూరల్: ధాన్యం అమ్మిన రైతులకు కూటమి సర్కార్ చుక్కలు చూపిస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి వారాలు, నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ చేయలేదు. రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి అధికారులను అడిగితే ధాన్యం డబ్బులను ప్రభుత్వమే నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందని చెబుతున్నారు. దీంతో ధాన్యం అమ్మిన రైతులు రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ డబ్బులు మాత్రం పడటం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం విక్రయించిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్న ప్రభుత్వం తన హామీని నిలుపుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. పంట పెట్టుబడులు కోసం తీసుకున్న రుణాలకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

35 రోజులైనా

నరసాపురం మండలంలో మే నెల 10వ తేదీ నుంచి నేటి వరకూ సుమారు 35 రోజులు కావస్తున్నా ఇంత వరకూ రైతుల ఒక్క రూపాయి కూడా జమ చేసిన పాపాన పోలేదు. కేవలం మండలంలోనే 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా దీనికి సంబంధించి రూ.21 కోట్ల వరకూ చెల్లించాలి. కానీ ఇప్పటి వరకూ రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ 35 రోజుల్లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఇదిలా ఉంటే ధాన్యం కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో కురిసిన అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు ముఖం చాటేయడంతో చాలా మంది ప్రైవేటు వ్యాపారులకే అయిన కాడికి విక్రయించుకున్నారు. ధాన్యం రంగు మారింది. తడిచింది అనే వివిధ కారణాలతో ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో ఇంకా ఇంటి పట్టున, కళ్లాల్లోనూ ఒబ్బిడి చేసిన ధాన్యం రాశులతో ఎదురుచూస్తున రైతులు కూడా మల్లవరం లంక గ్రామంలో దర్శనమిస్తున్నారు.



మల్లవరంలంక గ్రామంలో రైతు ఇంటి వద్ద ఆరబెట్టిన ధాన్యం

నాలుగు వారాలైనా జమ కాలేదు



నేను మే నెల 10న నాలుగు ఎకరాల ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాను. దీనికి సంబంధించిన డబ్బులు వస్తాయని ఎదురుచూస్తున్నాను. వారం రోజుల్లో బ్యాంకు ఖాతాలో పడతాయని అధికారులు చెప్పారు. నాలుగు వారాలు గడిచినా డబ్బులు జమ కాలేదు.

– బాలం మల్లేశ్వరరావు, పరసావారి మెరక

కొనడానికి ఇబ్బందులు



నాకున్న రెండకరాలకు మరో నాలుగెకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. వరి కోతకోసిన సమయంలో వర్షం రావడంతో ధాన్యం తడిచింది. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని చెప్పినా ఆర్ఎస్‌కే అధికారుల వద్దకు ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం లేదు. దళారుల వద్దకు వెళితే చాలా తక్కువకు అడుగుతున్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– కపురు రామాంజనేయులు, మల్లవరంలంక